ఆభేరి ఝంపె

పలుకు తేనెల తల్లి - పవళించెను
కలికితనమునవిభుని - కలసినదిగాన

నిగనిగని మోముపై - నెఱులు కెలకుల చెదర
పగలైనదాక చెలి - పవళించెను
తెగని పరిణతులతో - తెల్లవాఱిన దాక
జగదేకపతితోడ - జట్టిగొనె గాన

కొంగు జాఱిన మెఱుగు - గుబ్బలొలయగతరుణి
బంగారు మేడపై - పవళించెను
చెంగలువ కనుగొనల - సింగారముల దొణక
అంగజగురుని తోడ - నలసినదిగాన

మురిపెంపు నటనతో - ముత్యాల మలగుపై
పరవశంబున తరుణి - పవళించెను
తిరువేంకటా చలా - ధిపుని కౌగిట గూడి
అరవిరై నునుజెమట - నంటినదిగాన

ప్రపంచంలోని ఏ సంస్కృతిలోనూ లేని విశేషం మన సంస్కృతిలో ఉంది. శృంగారాన్ని ఆధ్యాత్మిక దృష్టితో చూడడం అన్నది ఇతర దేశాల వాఙ్మయ చరిత్రలలోనే లేదు. ఈ ప్రక్రియకు రసవన్నాందీ ప్రస్తావన చేసినది శ్రీమచ్ఛంకరాచార్యులవారు. వారి కనకధారాస్తవంలోని ఈ శ్లోకం అందుకు తార్కాణం.

అమీలితాక్ష మధిగమ్య ముదా ముకుందం
ఆనందకందమనిమేష మనంగ తంత్రం
అకేకర స్థిత కనీనిక పక్ష్మనేత్రం
భూత్యై భవేన్మమ భుజంగ శయాంగనాయా !

తనువు వివశమై, అనితర సురతుల ఆనందలహరిలో అలసి అలరినహరిని అనిమిషదృష్టులతో చూచేసరికి సిరికి కడుసిగ్గయింది. కనులు మూసికొన్నది. కాని తనివి తీరక కనులరమూసి కనుగొనల కనుపాపలమరగా హరిని తిలకించు ఆ సిరి కడగంటి చూపులు (నాపై ప్రసరించి) నాకు  ఐశ్వర్యము కలుగజేయుగాక అని సంభోగవివశ శృంగారానికి అద్దంపట్టారు శంకరులు.

ఈ సంకీర్తన శంకరుల శ్లోకానికేమీ తీసిపోలేదు. విభునితో శృంగారంలో అలసిన అలమేల్మంగ పవళించిన సొబగులు తన పలుకు తేనెలలో చిందించి నాడు అన్నమయ్య స్వామి జగదేకపతి అతనితో కంతుపంతాలు ఎంత శ్రమదాయకం! అందుకే అలమేల్మంగ అలసి సొలసి పవళించినది.

తన సువర్ణ హర్మ్యంలో ఆమె వివశయై ఒడలెఱుగక, కొంగు జాఱి, అలసిన తన కుచరోచులు బయల్పడగా పవళించినది. నిజమేమరి. ఎఱ్ఱకలువలబోలిన తన కనుల కొనల శృంగారాలు తొణికిసలాడగా, మన్మధుని కన్నతండ్రితోడి కంతుకేళిలో అలసినదిక దా ఆమె !

నిద్రలోసైతం లాస్యముద్రల ఒయ్యారంతో, ముత్యాల పందిరిపై పరవశయై పవళించినది తిరువేంకటపతి కౌగిట నలిగి, అరవిరియై చెమట చిత్తడినంటి అలసినది కదామరి.